రైతు సంక్షేమమే సహకార సంఘం లక్ష్యం





- *లాభాల బాటలో సహకార బ్యాంకు.*
- *పెండింగ్ బకాయిల వసూళ్లకు సభ్యులు సహకరించాలి.*
- *రైతులకు రుణ సదుపాయాలు, గోదాము–కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు చర్యలు*

దశ, అబ్దుల్లాపూర్‌మెట్: రైతుల సంక్షేమం, వారి ఆర్థిక అభివృద్ధే బాటసింగారం సహకార సంఘం ప్రధాన లక్ష్యమని సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బాటసింగారం రైతు సేవా సహకార సంఘం 59వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం పనితీరు, సభ్యులకు అందిస్తున్న సేవలు, రుణ సదుపాయాలు, పెండింగ్ బకాయిలు, ఆదాయ-వ్యయాలు, సంఘం ఆర్థిక పరిస్థితి, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు. రైతులకు అవసరమైన రుణ సదుపాయాలు, ఇతర సహకార సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు సంఘాన్ని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

రూ.4 కోట్లకు ఎఫ్‌డీలు

సంఘం ఆర్థికంగా బలోపేతమవుతున్న తీరును వివరిస్తూ.. గతంలో సెంట్రల్ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని వాటిని చెల్లించే స్థితిలో ఉన్న సంఘం, ప్రస్తుతం పాలకవర్గం కృషితో సెంట్రల్ బ్యాంకులో సుమారు రూ.4 కోట్లకు ఎఫ్‌డీలు చేసే స్థాయికి చేరుకుందని తెలిపారు. ఈ నిధుల ద్వారా రైతులకు మరింత మెరుగైన రుణ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు.

బకాయిల వసూళ్లకు సహకరించాలి

సంఘానికి సంబంధించిన పెండింగ్ రుణ బకాయిల వసూళ్లపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. సభ్యులు తమ బకాయిలను నిర్ణీత సమయంలో చెల్లించి సంఘానికి సహకరించాలని జైపాల్‌రెడ్డి కోరారు. బకాయిలు సకాలంలో చెల్లించడం ద్వారా సంఘం ఆర్థికంగా మరింత బలోపేతమవుతుందని, తద్వారా మరింత మంది రైతులకు రుణాలు, సహకార సేవలు అందించే అవకాశం ఉంటుందని వివరించారు.

గోదాము, కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు చర్యలు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో రైతుల సౌకర్యార్థం గోదాము, కోల్డ్‌స్టోరేజీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు జైపాల్‌రెడ్డి తెలిపారు. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు ఈ సదుపాయాలు ఉపయోగపడతాయని అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు.

సంఘ అభివృద్ధిపై సమీక్ష

59వ సర్వసభ్య సమావేశంలో సంఘం ప్రస్తుత పరిస్థితి, గత కార్యకలాపాలు, ఆదాయ-వ్యయాలు, సభ్యులకు అందిస్తున్న సేవలు, రుణాల పరిస్థితి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. సంఘం అభివృద్ధికి సభ్యులు తమ సూచనలు, సలహాలు అందించాలని జైపాల్‌రెడ్డి కోరారు. సమావేశంలో సంఘం మేనేజర్ జక్కుల ఐలేష్ సంఘం కార్యకలాపాలు, ఆర్థిక వివరాలను సభ్యులకు వివరించారు.

శ్రీనివాస్‌రెడ్డి, ఇటుకల మహేందర్‌రెడ్డి, మొగళ్ల యాదిరెడ్డి, గుండే బాలనర్సయ్య, చింతల లక్ష్మమ్మ, పురం నర్సింహారెడ్డి, మాజీ చైర్మన్ పురం యాదిరెడ్డి, కోటి ప్రభాకర్‌రెడ్డి, మేడిపల్లి ప్రియ చందశేఖర్‌గౌడ్, రఘువీర్‌రెడ్డి, కోలన్ ప్రసన్న లక్ష్మి రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కరిమెల వెంకటేష్, మాజీ ఎంపీటీసీ భీమగాని భాస్కర్‌గౌడ్, ఎండీ గౌసొపాషా, బుగ్గ చంద్రగౌడ్, బుగ్గ చాన్‌గౌడ్, కోట లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

33 ఏళ్ల సేవలకు వీడ్కోలు.. షేక్ లియకత్ అలీకి ఘన సన్మానం



దశ, రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో క్లీనర్‌గా విధులు నిర్వహించిన షేక్ లియకత్ అలీ 33 ఏళ్ల సుదీర్ఘ సేవలను పూర్తి చేసుకుని బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి ఆయనను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం పాటు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ కార్యాలయ కార్యకలాపాలకు అందించిన సేవలను అభినందించారు. సహచరులతో స్నేహపూర్వకంగా ఉంటూ తన విధులను సమర్థవంతంగా నిర్వహించి అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం షేక్ లియకత్ అలీ ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని అధికారులు, సిబ్బంది ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి బాలేశ్వరి, ఏవీఎస్ ప్రసాద్, టైపిస్టు అనిత, ఆఫీస్ సబార్డినేట్ ఫకీర్ చంద్తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ వైరు పడటంతో మిల్క్ వ్యాన్‌లో మంటలు

❖ కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ సమీపంలో ఘటన



దశ, అబ్దుల్లాపూర్ మెట్ : కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ సమీపంలో రోడ్డుపక్కన నిలిపిన పాల వ్యాన్‌లో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ వైరు వ్యాన్‌పై పడటంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు పోలీసులు తెలిపారు. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం వొల్లూరుపాలెంకు చెందిన చింతకుంట జయరాజ్ (51) విజయవాడ నుంచి ఎల్‌బీనగర్‌కు విజయ డెయిరీ పాలను మిల్క్ వ్యాన్ (AP39VE5007)లో తరలిస్తుంటారు.

మంగళవారం విజయవాడ నుంచి పాలు తీసుకొచ్చి ఎల్‌బీనగర్‌లో అన్‌లోడ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం విజయవాడకు తిరిగి వెళ్తూ కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ సమీపంలో వ్యాన్‌ను రోడ్డుపక్కన నిలిపి టీ తాగేందుకు వెళ్లారు. సుమారు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తిరిగి వచ్చేసరికి వ్యాన్‌లో మంటలు చెలరేగి ఉండటాన్ని గమనించారు. వెంటనే సమాచారం అందడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. విద్యుత్ వైరు వ్యాన్‌పై పడటంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదం సంభవించినట్లు జయరాజ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి 10 రోజుల గడువు

కొందుర్గ్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై సమీక్ష.

దశ, రంగారెడ్డి: కొందుర్గ్ మండలంలో పెండింగ్‌లో ఉన్న వివిధ రెవెన్యూ దరఖాస్తులను 10 రోజుల్లోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు.

కొందుర్గ్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించిన అదనపు కలెక్టర్.. తహసీల్దార్, సిబ్బందితో వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూ భారతి పెండెన్సీ, రీసర్వే పనుల పురోగతి, వివిధ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు, కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ దరఖాస్తులు, ఎఫ్‌లైన్ పిటిషన్ల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు.

పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్, సిబ్బందికి సూచించారు. సమీక్షించిన అన్ని అంశాల్లోని పెండెన్సీలను 10 రోజుల్లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని స్పష్టం చేశారు.

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో తీసుకున్న చర్యలు, సాధించిన పురోగతిపై సమగ్ర కంప్లయన్స్ నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నిర్ణీత సమయంలో రెవెన్యూ సేవలు అందేలా సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి సూచించారు.

నందిగామలో అంగన్‌వాడీ, పాఠశాల, పీహెచ్‌సీ తనిఖీ

❖ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి



దశ, రంగారెడ్డి : నందిగామ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (MPPS), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC)లను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి బుధవారం సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు.

మొదట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ చిన్నారుల హాజరు, వారికి అందుతున్న పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్య, కేంద్రం నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

అనంతరం MPPS పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, బోధనా విధానం, మౌలిక వసతులు, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డాక్టర్ కిరణ్మయి.. వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సకాలంలో, సమర్థవంతంగా అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని, ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి సూచించారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

❖ పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి.. దర్యాప్తు నాణ్యత పెంచాలని సీపీ సుమతి ఆదేశం



దశ, మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ అధ్యక్షతన నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని నేర పరిస్థితి, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, పోలీసుల పనితీరును సీపీ సమీక్షించారు. నేరాల ఛేదన, దర్యాప్తు నాణ్యత, కేసుల్లో శిక్షలు పడేలా తీసుకోవాల్సిన చర్యలు, సైబర్ నేరాల నియంత్రణ, సీసీటీవీ నిఘా, ముందస్తు పోలీసింగ్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు సమీక్షించారు. పెండింగ్ కేసులను క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సీపీ సూచించారు. దర్యాప్తులను సకాలంలో పూర్తి చేసి, కేసుల్లో సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. నేరాలను సమీక్షించి, విశ్లేషించి, తక్షణ చర్యలు చేపడుతూ ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయాలని సీపీ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నకిలీ ఎరువుల తయారీపై ఉక్కుపాదం



❖ గోదాములు, పాత పౌల్ట్రీ షెడ్ల యజమానులకు వ్యవసాయ శాఖ హెచ్చరిక

దశ, రంగారెడ్డి: జిల్లాలో నకిలీ, అనధికార ఎరువుల తయారీ, ప్యాకింగ్, నిల్వకు పాల్పడుతున్న వారిపై వ్యవసాయ, పోలీసు శాఖల సమన్వయంతో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి సుజాత తెలిపారు. గత రెండు నెలల్లో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు గ్రామాల్లో రెండుసార్లు నకిలీ ఎరువుల ప్యాకింగ్, నిల్వ వ్యవహారాలను గుర్తించినట్లు వెల్లడించారు.

కుంట్లూరు గ్రామంలో అనుమతులు లేకుండా ఎరువుల తయారీ, ప్యాకింగ్, నిల్వ చేస్తున్నట్లు గుర్తించి MOP, DAP, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు, ప్యాకింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ముగ్గురిని అరెస్టు చేయడంతో పాటు షెడ్ యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

షెడ్లు, గోదాముల యజమానులకు హెచ్చరిక

జిల్లాలో ఇటీవల వెలుగుచూసిన ఘటనల నేపథ్యంలో పాత పౌల్ట్రీ షెడ్లు, గోదాములు, ఇనుప షెడ్లు, ఖాళీ భవనాలు తదితరాలను అద్దెకు ఇచ్చే యజమానులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ సూచించింది. ఇలాంటి ప్రదేశాలను అనధికార ఎరువుల తయారీ, ప్యాకింగ్, నిల్వకు ఉపయోగించే అవకాశం ఉన్నందున అద్దెదారుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. అద్దెకు ఇచ్చే ముందు టెనెంట్ ఆధార్, మొబైల్ నంబర్, పూర్తి చిరునామా తదితర గుర్తింపు వివరాలను తీసుకుని లిఖితపూర్వక అద్దె ఒప్పందం చేసుకోవాలని తెలిపారు. అద్దెకు తీసుకున్న వ్యక్తి అక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారో యజమానులు తెలుసుకోవాలని సూచించారు.

ఎరువులు, పురుగుమందులు లేదా ఇతర వ్యవసాయ ఇన్‌పుట్ల తయారీ, ప్యాకింగ్, నిల్వ వంటి అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అద్దెకు ఇచ్చిన ప్రదేశంలో అక్రమ కార్యకలాపాలు జరుగుతున్న విషయం తెలిసి కూడా నిర్లక్ష్యం చేస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసుల్లో వారిని A1గా చేర్చే అవకాశం ఉందని హెచ్చరించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నకిలీ ఎరువుల వల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉన్నందున రైతులు ఎరువుల కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ సూచించింది. అనుమానాస్పద ఎరువులు లేదా అక్రమ నిల్వలపై సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని కోరింది.

నకిలీ ఎరువుల తయారీ, అక్రమ నిల్వ, రవాణాను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ-పోలీసు శాఖల ఆధ్వర్యంలో సంయుక్త తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పాత పౌల్ట్రీ షెడ్లు, ఇనుప షెడ్లు, పాడుబడిన భవనాలు, గోదాములు, ఇతర అనుమానాస్పద ప్రాంతాలపై నిఘా కొనసాగించాలని అన్ని మండలాల వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి సుజాత పేర్కొన్నారు.

అక్టోబర్ 2న 'డిమాండ్స్ డే'..

❖ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి IJU పిలుపు.

దశ, రంగారెడ్డి: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా 'IJU నేషనల్ డిమాండ్స్ డే' నిర్వహించాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (IJU) పిలుపునిచ్చింది. జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమం, వేతనాలు తదితర సమస్యల పరిష్కారం కోసం పలు డిమాండ్లను ముందుకు తీసుకొచ్చింది.

ఈ సందర్భంగా సమగ్ర మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయడం, జర్నలిస్టులు-మీడియా సంస్థల భద్రత కోసం ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తీసుకురావడం వంటి ప్రధాన డిమాండ్లను IJU ప్రతిపాదించింది.

అలాగే పనిచేస్తున్న జర్నలిస్టులకు గతంలో ఉన్న చట్టపరమైన రక్షణలను పునరుద్ధరించడం, మీడియా ఉద్యోగుల కోసం కొత్త వేజ్ బోర్డును ఏర్పాటు చేయడం, అర్హులైన జర్నలిస్టులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించడం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు ఆరోగ్య సేవలను పునరుద్ధరించడం వంటి డిమాండ్లను కూడా ప్రకటించింది.

అక్టోబర్ 2న జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని IJU కోరింది. తెలంగాణలో TUWJ ఆధ్వర్యంలో కూడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సమాచారం.

నాలుగు గ్రామాల్లో ఎస్సీ సెల్ కమిటీలు

దశ, మంగపేట: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర మంత్రి డాక్టర్ సీతక్క, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు మంగపేట మండలంలోని నాలుగు గ్రామాల్లో నూతన ఎస్సీ సెల్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బసారీకారి హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎంపెల్లి వీరస్వామి, మైప లాలయ్య, పల్లికొండ యాదగిరి పాల్గొన్నారు. నూతన కమిటీలు గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి కృషి చేయాలని వారు సూచించారు. బోర్ నర్సాపూర్ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎల్. పీ. నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా దీగొండ దుర్గారావు ఎన్నికయ్యారు. కోమటిపల్లి అధ్యక్షుడిగా కొత్త సాయిలు, ప్రధాన కార్యదర్శిగా గోడిశాల ముత్తయ్యను ఎన్నుకున్నారు. నీలాద్రిపేట అధ్యక్షుడిగా జాడి రవి, ప్రధాన కార్యదర్శిగా గాండర్ల సుధాకర్ ఎంపికయ్యారు. పురేడుపల్లి అధ్యక్షుడిగా మంద కొమరయ్య, ప్రధాన కార్యదర్శిగా బొమ్మకంటి రాజమౌళి ఎన్నికయ్యారు. గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ఓయూలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ స్మారక ఉపన్యాసాలు





దశ ఓయూ: ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని బుధవారం ఆర్ట్స్ కళాశాలలోని 121వ గదిలో నిర్వహించారు. విద్య, సమానత్వం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి అంశాలపై వారి ఆలోచనలు, సిద్ధాంతాల ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఫూలే-అంబేడ్కర్ సమ్మిళిత, సాధికారత అధ్యయనాల కేంద్రాలు, సెల్‌ల సహకారంతో కార్యక్రమం జరిగింది.

విద్యతోనే సామాజిక మార్పు:
'విద్య, సమానత్వం, సామాజిక న్యాయం-అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ వారసత్వం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాసాల్లో ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్‌రావు, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హెచ్. వాఘేశన్ ప్రసంగించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ దేశ ప్రజాస్వామ్యం, సామాజిక మార్పు కోసం చేసిన కృషిని వివరించారు. రాజ్యాంగ విలువలు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సాధికారతలో వారి ఆలోచనల ప్రాధాన్యాన్ని చర్చించారు.

పుస్తకావిష్కరణ:
కార్యక్రమంలో ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్, కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ. డైసీ రచించిన 'అప్లైడ్ ఎకనామిక్స్-ప్రిన్సిపుల్స్ అండ్ రియల్ వరల్డ్ అప్లికేషన్స్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను యువతకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని డైసీ పేర్కొన్నారు. విద్య ద్వారా సామాజిక మార్పు సాధ్యమవుతుందని, సమానత్వం, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడంలో విశ్వవిద్యాలయాలకు కీలక బాధ్యత ఉందన్నారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేశ్‌రెడ్డి, వీసీ ఓఎస్డీ ప్రొఫెసర్ ఎస్. జితేందర్‌కుమార్ నాయక్ మార్గదర్శకత్వంలో కార్యక్రమం జరిగింది. ప్రొఫెసర్ సి. కాసీం, ప్రొఫెసర్ లింగప్ప, డాక్టర్ మాధవి, ప్రొఫెసర్ హమీదాబీ, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌తో పాటు పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కేంద్రాల డైరెక్టర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూలో ఉచిత విద్య కోసం విద్యార్థుల నిరసన



దశ ఓయూ: ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు నిరసన చేపట్టారు. ఓయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద యువజన సేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువజన సేన నాయకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉచిత విద్యను అమలు చేయడంతో పాటు విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలని కోరారు. ప్రైవేటు విద్యనునియంత్రించి ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్య, భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం..
యువకుడి అరెస్ట్

❖ *రూ.8 లక్షలు, 3½ తులాల బంగారం తీసుకున్నట్లు ఫిర్యాదు*



దశ, హయత్‌నగర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతితో సన్నిహితంగా మెలిగి, ఆమె వద్ద నుంచి నగదు, బంగారు ఆభరణాలు తీసుకుని అనంతరం పెళ్లికి నిరాకరించిన కేసులో ఓ యువకుడిని హయత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన *అమ్మోత్ నవీన్ (23)*పై హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో Cr. No.1571/2026 కింద కేసు నమోదైంది.

బాధితురాలి ఫిర్యాదు మేరకు.. 2022లో ఆమె బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో హాస్టల్ సమీపంలోని బేకరీలో పనిచేస్తున్న నవీన్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలానికి ప్రేమ పేరుతో తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అతని మాటలు నమ్మిన ఆమెతో వివిధ ప్రాంతాల్లోని ఓయో లాడ్జీలు, తన ఇంట్లో పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నట్లు తెలిపింది. 2024, 2025లో రెండుసార్లు తాను గర్భం దాల్చగా, గర్భస్రావం కోసం నవీన్ మాత్రలు తీసుకొచ్చి ఇచ్చాడని బాధితురాలు ఆరోపించింది. అలాగే పెళ్లి చేసుకుంటాడనే నమ్మకంతో తన వద్ద ఉన్న సుమారు 3½ తులాల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి, వివిధ సందర్భాల్లో నగదు ఇచ్చినట్లు తెలిపింది. మొత్తంగా సుమారు రూ.8 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొంది.

ఈ ఏడాది ఆగస్టు 31న కూడా తన ఇంటికి వచ్చిన నవీన్ తనతో శారీరక సంబంధం పెట్టుకున్న అనంతరం ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసి, పెళ్లికి నిరాకరించాడని బాధితురాలు తెలిపింది. పెళ్లి గురించి ప్రశ్నించగా చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా బాధితురాలికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు దర్యాప్తు అధికారి ఎస్ఐ కె. లక్ష్మీనారాయణ కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సీహెచ్. శంకరయ్య తెలిపారు.



పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు.. ఘన సన్మానం

❖ *స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్*



దశ, చౌటుప్పల్ : పురపాలక సంఘం పరిధిలో నిర్వహిస్తున్న "స్వచ్ఛత హీ సేవా" కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతతో పాటు ఆర్థిక భద్రతకు ప్రభుత్వం అందిస్తున్న PMJJBY, PMSBY బీమా పథకాలపై అవగాహన కల్పించారు. పట్టణ పరిశుభ్రతలో కీలకపాత్ర పోషిస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, స్వచ్ఛ ఆటో సారథులు, వేస్ట్ పిక్కర్లు, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లకు PPE కిట్లు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులు, వేస్ట్ పిక్కర్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. విధి నిర్వహణలో వారి ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా PPE సేఫ్టీ కిట్లు ధరించి సురక్షితంగా విధులు నిర్వహించాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆరోగ్య పరీక్షలు, బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, కౌన్సిలర్ హనుమహమ్మద్, నాయకులు బత్తుల దాసు, దేప రాజు, డాక్టర్లు జయంత్ కుమార్, సౌజన్య, CHO కృష్ణ కుమార్, HE సాయి రెడ్డి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, RO అంజయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



దశ ఓయూ: మహాత్మా జ్యోతిబా ఫూలే బాలికల గురుకుల పాఠశాలను తెలంగాణ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆయన ముచ్చటించి పాఠశాలలో అందుతున్న విద్య, బోధన తీరు, హాస్టల్ వసతులు, భోజనం, తాగునీరు, ఆరోగ్యం, క్రీడలు తదితర అంశాలపై ఆరా తీశారు. చదువులో ఎదురవుతున్న సమస్యలు, అవసరాలు, భవిష్యత్తు లక్ష్యాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందితో మాట్లాడి విద్యార్థుల విద్యా పురోగతి, బోధనలో ఎదురవుతున్న సమస్యలు, పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణ, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా అవకాశాలు కల్పించాలని సూచించారు. పాఠశాల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యనిర్వాహక సమావేశాలు

❖ *అక్టోబర్ 2 నుంచి 4 వరకు నిర్వహణ.. 3న 'శిక్షా భూషణ్' పురస్కారాల ప్రదానం*



దశ ఓయూ: అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ కార్యనిర్వాహక కమిటీ సమావేశాలు హైదరాబాద్‌లో అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలంగాణరాష్ట్రఏబీఆర్ఎస్ఎంకన్వీనర్ డాక్టర్ ఈ.యాదయ్యతెలిపారు. ఉప్పల్‌లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. సమావేశాల్లో భాగంగా అక్టోబర్ 3న సాయంత్రం 5.30 గంటలకు నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో 'అఖిల భారతీయ శిక్షా భూషణ్ సమ్మాన్ సమారోహ్' నిర్వహించనున్నారు. విద్యారంగంలో విశేష సేవలు అందించిన ముగ్గురికి ప్రతిష్టాత్మక 'శిక్షా భూషణ్' పురస్కారాలను అందజేయనున్నారు. యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఎం. జగదీశ్ కుమార్, ఐఐఎం బెంగళూరు మాజీ ప్రొఫెసర్, డీన్ ప్రొఫెసర్ బి. మహాదేవన్, విజ్ఞాన విహార్ విద్యాసంస్థల మాజీ ప్రిన్సిపాల్ శ్రీ డి. రామకృష్ణరావు పురస్కారాలు అందుకోనున్నారు. కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ సహ సర్కార్యవాహ్ శ్రీ ముకుంద సి.ఆర్. ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఏబీఆర్ఎస్ఎం అధ్యక్షుడు ప్రొఫెసర్ నారాయణ్‌లాల్ గుప్తా అధ్యక్షత వహిస్తారు.

లయన్స్ కంటి హాస్పిటల్ లో పారిశుధ్య కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరం



దశ సూర్యాపేట ప్రతినిధి : సూర్యాపేట పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికుల కృషి ఎనలేనిదని లైన్స్ కంటి హాస్పిటల్ వైస్ చైర్మన్ తోట శ్యాం ప్రసాద్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో చైర్మన్ మీలా మహాదేవ్ నేతృత్వంలో లైన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది సూచన మేరకు సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డులలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు చేయించాలన్న సూచన మేరకు లయన్స్ కంటి ఆసుపత్రిలో ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. పట్టణం బాగుండాలంటే పారిశుధ్య కార్మికుల కంటి చూపు బాగుండాలి అనే సదుద్దేశంతో మున్సిపల్ చైర్మన్ ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. సూర్యాపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుంచేందుకు మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది చేస్తున్న కృషి ఎనలేనిదని ఈ సందర్భంగా కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట ఆధ్వర్యంలో లయన్స్ కమిటీ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాలతో పాటు హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగిందన్నారు.

అదేవిధంగా సూర్యాపేట పట్టణంలోని 48 వార్డులలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు లయన్స్ ఐ హాస్పిటల్ సిద్ధంగా ఉందని తెలిపారు. లయన్స్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట సెకండ్ గవర్నర్ గుడిపూడి వెంకటేశ్వరరావు, లయన్స్ ఐ హాస్పిటల్స్ సెక్రటరీ పెండం చంద్రశేఖర్, క్లబ్ అధ్యక్షుడు యాద కిరణ్, గుండా లక్ష్మయ్య, మిర్యాల వెంకటేశ్వర్లు, హరిహరరావు, సంతోష్, మున్సిపల్ అధికారులు, లయన్స్ క్లబ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు

❖ *జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్*

దశ, సూర్యాపేట ప్రతినిధి : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో దెబ్బతిన్న రోడ్లకు నాణ్యతతో, వేగంగా మరమ్మతులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డితో కలిసి 14వ వార్డులోని వినాయకనగర్, కృష్ణానగర్, వెంకటేశ్వర కాలనీల్లో కలెక్టర్ పర్యటించి రోడ్లు, పార్కులు, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. వినాయకనగర్ మెయిన్‌రోడ్డులో దెబ్బతిన్న రోడ్డును పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కృష్ణానగర్ పార్కు అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. ఓపెన్ ప్లాట్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షాకాలంలో దోమల కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ బండారు రాజా, ఈసీ మెంబర్ వెంపటి పురుషోత్తంలకు ఘన సన్మానం

దశ సూర్యాపేట ప్రతినిధి : సూర్యాపేట జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన బండారు రాజా, మెంబర్‌గా ఎన్నికైన వెంపటి పురుషోత్తంలను సూర్యాపేట ఆర్యవైశ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య మిత్రులు కలకోట లక్ష్మయ్య, తప్సీ గాంధీ ల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి మాశెట్టి అనంత రాములు ముఖ్య అతిథులుగా హాజరై బండారు రాజా, వెంపటి పురుషోత్తంలను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బండారు రాజా ఆర్యవైశ్యులందరితో స్నేహభావంతో మెలుగుతూ, పార్టీలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉంటూ మంచి పేరు సంపాదించారని కొనియాడారు. ఆర్యవైశ్య సమాజానికి ఏ సమస్య వచ్చినా స్పందిస్తూ, తనవంతు సహాయ సహకారాలు అందించడంలో ముందుంటారని పేర్కొన్నారు. అలాగే లయన్స్ క్లబ్, వాసవి క్లబ్‌తో పాటు జిల్లా, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభల్లో పలు బాధ్యతలు నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం రెడ్ క్రాస్ సొసైటీలో కీలక బాధ్యతలు చేపట్టిన బండారు రాజా, మెంబర్‌గా ఎన్నికైన వెంపటి పురుషోత్తంలు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.